# లేదురా ఇటువంటి భూమి ఇంకెందు...

ఈ పుణ్య భూమికి స్వతంత్రం వచ్చి ముప్పయ్ మూడేళ్ళయింది గదా. ఈ స్వతంత్ర భారతాన్ని నందనవనం చేసి, ఇక్కడున్న యావత్తు జనాభాను, సుఖసంతోష సముద్రాలలో వోలలాడించాలని ఏలిన వారు ప్రయత్నిస్తున్నారు గదా. కోటానుకోట్ల రూపాయలు ఖర్చు చేశారు గదా. దేశంలో డబ్బు చాలక విదేశాలనుండి కూడా అందినంత వరకూ అప్పులు చేశాడు గదా! ఇన్నీ అయ్యాక ఇప్పుడు లెక్కలు చూసుకొంటే కనిపించే అభ్యుదయం, నిజంగా అబ్బురంగా వుంది.

గ్రామ ప్రాంతాలలో నివసిస్తున్నవారిలో 23 కోట్ల 90 లక్షలమందీ, పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న 5 కోట్ల 50 లక్షల మందీ, వెరసి 29 కోట్ల 40 లక్షలమంది, దారిద్ర్యరేఖకు దిగువస్థాయిలో బతుకుతున్నారని ప్రణాళికా సంఘం వారి సర్వే చెబుతున్నది. 50, 60 లక్షల మాటేమిటిగానీ, దేశ జనాభాలో సుమారుగా సగం మంది ముష్టి బతుకు బతుకున్నారు. ఇలా బతుకుతున్నవారిలో కర్రి అప్పన్న వొకడు.

మనం మరీ అన్నింటిలోనూ తీసికట్టుగా వున్నామని అనుకోనవసంర లేదు. అందుకోసం బాధపడవలసిన అవసరమూ లేదు. చిన్న పిల్లల చేత పనిచేయించడంలో మనం అగ్రస్థానంలో వున్నాం. మన దేశంలో వున్న బాలలందరకూ ప్రాథమిక విద్యకు రాజ్యాంగం వాగ్దానం చేసింది. నిజమే. కానీ నూరింట ఐదు వంతుల మంది పిల్లలు పాఠశాలల్లో చేరడానికి బదులుగా పనిపాటల్లో చేరుతున్నారు.

1971వ సంవత్సరపు జనాభా లెక్కల ప్రకారం మనదేశంలో 23 కోట్లమంది బాలబాలికలున్నారు. దేశ జనాభాలో వీరి సంఖ్య దాదాపుగా 42 శాతం. మంచి తిండి యివ్వలేనికారణంగా నెలకొక లక్షమంది పిల్లల్ని మనం చంపుకొంటున్నాం. ప్రతి ఏడాదీ 25 లక్షల మంది పిల్లలు గుడ్డివాళ్ళు కాకుండా ఆపలేకపోతున్నాం. ఏటా 15 లక్షలమంది పిల్లలు బిచ్చగాళ్ళుగా మారిపోతుంటే చూస్తూ వూరుకుంటున్నాం. 9 కోట్ల 20 లక్షల మంది పిల్లలు దరిద్రరేఖకన్నా తక్కువ స్థాయిలో బతుకుతున్నా సహిస్తున్నాం. ఇలా బతుకుతున్న వారిలో సింహాచలం వొకడు.

సింహాచలం తండ్రి పేరు అప్పన్న- పెద్ద కొడుకు సింహాచలం, వారిద్దరి మధ్యా కాల వ్యవధి సుమారు వో పావు శతాబ్దం వుంటుంది. ఈ పాతికేళ్ళలో ఎన్ని అద్భుతాలయినా జరగవచ్చని ఎవరయినా అనుకుంటారు. కానీ ఏ అద్భుతమూ జరగలేదు. జరిగిందేమిటంటే-

అప్పన్న బానిస దేశంలో పుట్టాడు. సింహాచలం స్వతంత్ర దేశంలో పుట్టాడు. అప్పన్న బానిస దేశంలో పలకా బలపమూ పుచ్చుకుని రెండేళ్ళపాటు బళ్ళోకెళ్ళాడు. సింహాచలం స్వతంత్ర దేశంలో రెండు వారాలపాటు కూడా బడికెళ్ళలేదు. అప్పన్న స్వతంత్ర భారతంలో పెళ్ళాడాడు.

"ఈ కరూ రోజుల్లో అప్పటి దాకా బతికిన్నాటి మాటగందా!" అంది కొండమ్మ ముక్కెరనత్తును సర్దుకుంటూ, జీవితం తన్నేతన్నుల్ని భరించలేక ఆ కుటుంబం గావుకేకలు వేసింది. ఊరూరూ, వీధి వీధీ తిరిగింది.

అన్నీ సక్రమంగా ఉండే యిజీనగరంలోనే వుండాల్సింది. అన్నీ సక్రమంగా ఉండవనీ, వుండనివ్వరనీ, ఆ కుటుంబానికి తెలీదు. పార్వతీపురం, సాలూరు, తువిడాం, బొబ్బిలి తిరిగి తిరిగి

విసుగెత్తి, టిక్కెట్లు కూడా లేకుండా అనకాపల్లి వచ్చారు. 'అనకాపల్లి'లో 'ఉద్దేగం' తేరగా దొరుకుతుందని ఎవరో చెప్పారుట. అప్పన్నకు ఆ మాటమీద గురికుదిరింది. 'నెగశా' అంటూ కొండమ్మనూ, సింహాచలాన్నీ తీసుకొచ్చేశాడు అనకాపల్లికి.

అనకాపల్లిలో మాత్రం ఏముంది గనక? కొండమ్మ వోటేల్‌లో పనిచేసింది. అప్పన్న నూనెమర దగ్గర, బెల్లం యార్డులోనూ పనిచేశాడు. చాకిరితప్ప - కడుపు సొద తీరడం లేదు.

విశాఖపట్నం "బోవు పెద్దచిటీ" గనక పనులు బాగా దొరుకుతాయన్నారెవరో. అనకాపల్లికి 'దొణ్ణం' పెట్టేసి విశాఖపట్నం మకాం మార్చాడు అప్పన్న రెండేళ్ళ తర్వాత. కొంతకాలం కూలీనాలీ చేశాడు. ఓసారి వో పెద్ద మనిషి కూరగాయల బుట్టను ఇంటిదాకా తెస్తే రెండు రూపాయలిస్తానన్నాడు. రెండు రూపాయలంటే చిన్న మొత్తమేమీ కాదు గదా! నెత్తి కెత్తుకున్నాడు. చచ్చేంత బరువుగా వుంది. రెండు రూపాయల మీది తీపితో మెడనరాలు సుడులు తిరుగుతున్నా, చుట్టలు తిరుగుతున్నా కిక్కుకరుమనకుండా భరించాడు.

తట్టలో ఉన్నవి కూరగాయలు కావేమోనన్న అనుమానం వేసింది అప్పన్నకు. నడుస్తుంటే ఏవో సీసాలు కదులుతున్న చప్పుడవుతోంది. అతగాడి ఆసామి ముందు పోతున్నాడు అప్పుడప్పుడు వెనక్కు తిరిగి చూసుకొంటూ. అప్పన్న ఆయన్ను అనుసరించాడు. అరుగుమీద దించబోతే లోపలికి రమ్మన్నాడు. ఆయన తనూ సాయంబట్టి బుట్టను దించాడు. చెమట తుడుచుకొంటున్నప్పుడు రెండు కాదు- అయిదు రూపాయలిచ్చాడాయన.

తను మోస్తున్నది దొంగసరుకన్న సంగతి, చాలా కాలానిగ్గాని అప్పన్నకు తెలీలేదు. తెలిసాక ముందుగా వొణికిపోయాడు.

"మరేం భయంలేదు. అన్నీ నే చూసుకొంటా. అనుమానం కలక్కుండా చూసుకో. పట్టుబడినా నా పేరు చెప్పకు. చెప్పావో చంపేస్తాను నా కొడకా! నీ పెళ్ళాం బిడ్డల సంగతా- నా కొదిలెయ్" అన్నాట్ట ఆ పెద్ద మనిషి.

"అప్పటికీ నేను 'వొద్దో' అని మొత్తుకొంటూనే వున్నాను బాబుగారూ. వాడు నా మాట వినలా. పదులూ, పాతికలూ తెస్తుండేవాడు. మంచి మంచి గుడ్డలు వేసుకొనేవాడు. అప్పుడప్పుడు చెడతాగి కొంపకొస్తుండేవాడు" అన్నది అప్పలకొండమ్మ.

అప్పన్నకు అంతకుముందు తాగే అలవాటు లేదు. ఇక్కడికొచ్చాకా, ఈ ఛండాలం పనిలోకి దిగాకా, మెల్లిగా అలవాటు చేసుకున్నాడు. ఒక్కోసారి పెద్ద పెద్ద పెట్టెలూ, సంచులూ తీసుకురమ్మనేవాడుట పెద్దమనిషి. వాటి నిండా సిల్కుతానులు, గడియారాలు, చిన్న చిన్న రేడియోలు వుండేవిట. అలాంటివి దొంగచాటుగా తీసుకొచ్చేందుకు అప్పన్న భయపడ్డప్పుడు, ఆ పెద్ద మనిషి ధైర్యం చెప్పేవాడుట. మరీ దిగజారిపోకుండా వుండేందుకు 'మందు' మప్పేవాడుట. ఆ చెడతాగిన తిక్కలో, ఏ అఘాయిత్యం చేయమన్నా చేసేవాడుట అప్పన్న.

ఇంకోసారి- వేడవమీద ఎక్కడికో ప్రయాణమయ్యాడు అప్పన్న, ఏదో కొంప మునుగుతుందని కొండమ్మ అనుమానిస్తూనే ఉంది. బతిమిలాడింది. కాళ్ళట్టుకుంది, బెదిరించింది. చంపుతానన్నది, చచ్చిపోతానన్నది, అవతలి పెద్ద మినషి ఏం చెప్పాడో తెలీదు. అప్పన్న విన్నాడు కాదు. రాత్రి పదిగంట

లకు పూటుగా పట్టించాడు. రోడ్డుమీదక్కారొచ్చింది. అప్పన్న తూలుకుంటూ వెళ్ళాడు. అంతే!

- మరింక రానేలేదు.

“అప్పటినుంచీ ఈ బిడ్డకునేనూ, నాకు వీడూ దిక్కు” అంది కొండమ్మ ముక్కు చీదేస్తూ. ఊరికి దూరంగా, పొలాల్లోనూ రోడ్డు వొంచన చిన్నపాక వేసుకొంది కొండమ్మ. నేలను అద్దెకు తీసుకుంది. తన తండ్రికి గానుగుండేది. అప్పుడెప్పుడూ తను పనిచేయలేదుగానీ, పనిలోని బిగువులు తెలుసు ‘ఇసక తెస్తా, సున్నం తెస్తా గానుగుంది, కుర్రాడున్నాడు’ పొడి పొడిగా అంది. సింహాచలం అన్ని పనులు చేస్తాడు. ఎన్ని తట్టల ఇసక్కు, ఎంత సున్నాం వేయాలో, ఎన్ని చుట్లు తిరిగితే సున్నం పాకానికొస్తుందో అడిగిన ధర ఇచ్చేవాడికి కలిపే పాళ్ళేమిటో, గీసి గీసి బేరమాడేవాడి రోగం ఎలా కుదర్చాలో సింహాచలానికి బాగా తెలుసు. అయినా వాడు ఉలకడు, పలకడు. అడిగితే మాత్రం తల్లికేసి చూస్తూ అవునా కాదా చెపుతాడు.

డబ్బు వ్యవహారాలన్నీ కొండమ్మే చూస్తుంది. కప్పరకప్పర చీకటుండగా దున్నపోతును కడితే, చద్దన్నాలవేళకు ఒక విడత దిగిపోతుంది- తల్లీ తనూ కలిసి దాన్ని బండిలోకి చేరుస్తారు. ఆ దున్ననే బండిక్కట్టి ఖాతాదారు ఇంటికి చేరుస్తాడు సింహాచలం. సున్నం ఖరీదు వేరు, బాడుగ వేరు.

మళ్ళీ సాయంకాలం ఇంకో విడత చేస్తారు. దీన్ని కుప్పవేసి గడ్డీ గాదం కప్పి అది ఆరిపోకుండా నీళ్ళు చల్లుతారు. మళ్ళీ ఇసక, సున్నం పోసి, నీళ్ళు చల్లి నానబెడతారు. ఇక కప్పర చీకటుందనంగా లేచి...

“రెండు మూడేళ్ళ నుంచి ఇట్లానే బతుకుతున్నాం... అబ్బో చాలా ఇళ్ళకు సపలయ్ చేశాం నాయనా!” అంది అప్పల కొండమ్మ. ఇక్కడ గానుగాడిన సున్నంతో ఏ మహాభవనాలు, కార్యాలయాలు, విద్యాలయాలూ, వైద్యాలయాలూ రూపుదిద్దుకున్నాయో మనకు తెలియదు. మనకు తెలిసిందల్లా- పట్టుమని పదిహేనేళ్ళయినా లేని సింహాచలం పదిపదుల బతుకుభారాన్ని మోస్తున్నాడని మాత్రమే!